క్లుప్తంగా

హెచ్‌ఆర్‌పీసీఐ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న ఎస్‌ఐ అబ్దుల్ జహీర్

నందలూరు(రాజంపేట) : స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఆఫ్ ఇండియా (కడప, అన్నమయ్య ఉభయజిల్లాల) చైర్మన్ వి.డేవిడ్ కల్యాణ్‌రాజు ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా అతిథి గృహంలో భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక ఎస్‌ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ తోపాటు పలువురు యువకులు, నాయకులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సర్టిఫికెట్స్‌ను అందజేశారు. అలాగే స్వాతంత్య్ర సమరయోధులు గురించి వ్యాసరచన పోటీలు విజేతలకు నిలిచినవారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రోత్సాహకం అందజేత


నగదు పురస్కారం అందజేస్తున్న ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి

వీరబల్లి (రాయచోటి టౌన్) : స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. అనంతరం మరో కార్యక్రమంలో దక్షత్ ఫౌండేషన్ యజమాని శ్రీరాముల రెడ్డి ఆర్థిక సహకారంతో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి ఎంపీపీ రూ. 5116 నగదుతోపాటు మరి కొందరికి నగదు ప్రోత్సాహకాలను అందించారు.

అన్నదానం

రామాపురం : వృద్ధులకు తన వంతుగా అన్నదానం చేయడం సంతోషంతో పాటు సంతృప్తిగా ఉంటుందని వీఆర్‌డీఎస్ సురేంద్రరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వీరబల్లికి చెందిన శ్రీ దుగ్గనపల్లి కృష్ణారెడ్డి డిగ్రీ కళాశాల వ్యవస్థాపకుడు క్రిష్టారెడ్డి పంచమ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు సురేంద్రరెడ్డి మండలంలోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పరామర్శ


పిచ్చయ్యను పరామర్శిస్తున్న ఆకేపాటి

రాజంపేట : ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాజంపేట తాలుకా అధ్యక్షుడు పిల్లి పిచ్చయ్యను జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి పరామర్శించారు. మంగళవారం పిచ్చయ్య స్వగృహానికి జెడ్పీ చైర్మన్ వెళ్లారు. ఇటీవల హైదరాబాదులో గుండె సంబంధిత సమస్యకు చికిత్స పొంది ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను కలిసి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు.

ఆలయంలో వైభవంగా పుష్కర పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

పెనగలూరు : మండల కేంద్రం పరిధిలోని ఇండ్లూరు గ్రామంలో ఉన్న విఘ్నేశ్వరుడి ఆలయంలో మంగళవారం పుష్కర పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయం నిర్మించి మంగళవారంతో 12 సంవత్సరాలు పూర్తి చేసుకోవడంతో గ్రామస్తులు వేదపండితులతో పుష్కర పూజలు జరిపారు. మహిళలు కుంకుమపూజలో పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులందరికీ పంచామృతం, ప్రసాదాలను పంచిపెట్టారు. రాత్రికి ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనలు ఏర్పాటు చేశారు.

విద్యుత్ ప్రమాద బాధిత కుటుంబానికి భరోసా

రామాపురం : నీలకంఠ్రావుపేటకు చెందిన బేల్దార్ కూలీ ఖలీద్ మూడు నెలల క్రితం విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం రూ. 5 లక్షల పరిహారాన్ని మంజూరు చేసింది. మంగళవారం రాత్రి బాధిత కుటుంబానికి ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అందజేశారు. కుటుంబానికి ప్రభుత్వం నుంచి వైఎస్సార్ బీమా ద్వారా రూ. 5 లక్షలు మంజూరు చేయిస్తామని శ్రీకాంత్‌రెడ్డి హామీనిచ్చారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. అబ్దుల్ హుస్సేన్, సర్పంచ్ అయూబ్‌ఖాన్, మాజీ ఎంపీపీ నస్రీన్ సుల్తానా, సహదేవరెడ్డి, న్యామతుల్లా, ఇంతియాజ్, రామసుబ్బారెడ్డి, రషీద్, పురుషోత్తంరెడ్డి, ఇలియాస్, అహమ్మద్ పాల్గొన్నారు.

అంబరాన్నంటిన స్వాతంత్య్ర దినోత్సవ సంబరాలు

- రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి నియోజకవర్గాల్లో ఘనంగా వేడుకలు
- జెండా ఎగురవేసిన ఎమ్మెల్యేలు మేడా, గడికోట, కొరముట్ల
- జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్స్‌లో అలంరించిన విన్యాసాలు


రామాపురం: మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో..


చిన్నమండెం ఎంపీడీఓ కార్యాలయంలో..


చిట్వేలి: వందనం సమర్పిస్తున్న తహసీల్దార్


ఒంటిమిట్ట సచివాలయం వద్ద..


పెనగలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద..


రైల్వేకోడూరు: టోల్‌గేట్ వద్ద విద్యార్థులతో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు


రాయచోటి: కలెక్టర్ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రాయచోటి టౌన్ : గాంధీజీ కలలు కన్న గ్రామ స్వారాజ్య స్థాపన కోసం సీఎం జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పంద్రాగస్టు సందర్భంగా మంగళవారం రాయచోటిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యంలో భాగంగా ప్రతి గ్రామంలో ప్రజలకు పరిపాలన దగ్గరకు చేర్చాలని గ్రామ సచివాలయాలు, రైతు భరోసాలు, విలేజ్ క్లీనిక్‌లు ఏర్పాటు చేశారని చెప్పారు.

పుల్లంపేట : మండల వ్యాప్తంగా 77వ స్వాతంత్ర వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి ఎంపీడీఓ రఘురాం, తహసీల్దార్ నరసింహకుమార్‌ల ఆధ్వర్యంలో జెండా వందనం చేశారు.

సిద్దవటం : మండలంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో మంగళవారం 77 స్వాతంత్య్ర దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు కమాండెంటు ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా అయన జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం చేశారు. అనంతరం బెటాలియన్‌లోని ఆఫీస్ స్టాఫ్‌కు, పోలీసులకు, సేవా పథకాలను అందజేశారు. అలానే మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. మండలం కేంద్రంలోని కోర్టు ఆవరణ తోపాటు మట్లి రాజుల కోటలో జడ్జి శ్రీనివాస కల్యాణ్ జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు.

లక్కిరెడ్డిపల్లె : మహనీయుల త్యాగ ఫలితంతో స్వాతంత్య్రం సిద్ధించిందని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్యలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంతోపాటు స్థానిక ఉర్దూ పాఠశాల, నలంద విద్యానికేతన్ పాఠశాలల్లో ఎదుట త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి వందనం చేశారు.

రాయచోటి టౌన్ : రాయచోటి కోర్టు ఆవరణలో మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని 5వ అదనపు న్యాయమూర్తి కృష్ణ కుట్టి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పాతిమా, అడిషనల్ సివిల్ జడ్జి డాక్టర్ శారదలు జెండా ఎగుర వేశారు. అనంతరం వివిధ క్రీడలలో ప్రతిభ కనబరిచిన న్యాయవాదులకు, సిబ్బందికి బహుమతులు అందజేశారు. రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రిలో డీసీహెచ్, ఆస్పత్రి సూపరిడెంటెంట్ డాక్టర్ డేవిడ్ సుకుమార్, డీఈఓ కార్యాలయంలో డీఈఓ శ్రీరాం పురుషోత్తం, ఆర్‌డీఓ కార్యాలయంలో ఆర్‌డీఓ రంగాస్వామి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రేమంత్ కుమార్, రూరల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ తులసీరాం, మార్కెట్ యార్డులో చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ త్రిబేజ్‌ఖాన్‌లు జెండాను ఎగరవేశారు.

రాయచోటి అర్బన్ : బ్రిటీషు వారి ఆరాచకపాలనను అంతమొందించడానికి సాగిన భారత స్వాతంత్య్ర పోరాటానికి అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రతిరూపమని భారత న్యాయవాదుల సమాఖ్య (ఐఏఎల్)సమాఖ్య కడప, అన్నమయ్య జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్ అన్నారు. మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఐఏఎల్ న్యాయవాదులు అంబేడ్కర్ చిత్రపటం వద్ద స్వాతంత్య్ర వేడుకలను జరుపుకున్నారు. అలానే స్థానిక షాహి జామియా మసీదు వద్ద మత గురువు సయ్యద్ షర్ఫుద్దీన్ హుస్సేని, ఎస్.కె.ఫజుల్ ఇలాహి జాతీయజెండాను ఎగురవేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆయన మువ్వన్నెల జెండాను ఎగురవేశారు.

చిన్నమండెం : 77వ భారత స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలలో భాగంగా మండల వ్యాప్తంగా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి ఎంపీడీఓ రహీంతో కలిసి జెండాను ఎగరవేశారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ రమేష్‌బాబులు జెండాను ఎగరవేశారు. అదే విధంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, బ్యాంకులలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఓబులవారిపల్లె : మండల వ్యాప్తంగా మంగళవారం స్వాతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ విజయారావు ఆధ్వర్యంలో ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి జెండా ఎగురవేసి గౌరవ వందనం చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ పుల్లారెడ్డి జెండా ఎగురవేసి జెండా వందనం చేశారు.

చిట్వేలి : 77వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మండలంలో మువ్వన్నెల జెండా ఎగిరింది. తహసీల్దార్ శిరీష, ఎస్‌ఐ సుభాష్ చంద్రబోస్, ఎంపీడీఓ శివరామిరెడ్డి, ఎంఈఓ కోదండ నాయుడులు ఆయా కార్యాలయాలలో జెండా ఎగురవేసి వందన సమర్పణ చేశారు. అలాగే ఎంపీపీ చంద్ర, ఎల్‌వి మోహన్ రెడ్డి, చిట్వేలి సర్పంచ్ ఉమా మహేశ్వరరెడ్డి, మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డిలు జెండా ఎగురవేసి వందన సమర్పణ చేశారు. స్థానిక గ్రంథాలయ ఆవరణలో మానవత ఆధ్వర్యంలో ఉపసర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డి, సంస్థ సభ్యులు జెండా ఎగురవేశారు. సంస్థ కార్యదర్శి మునిరావు తన స్నేహితుడు కరీముల్లా బాషా వర్ధంతిని పురస్కరించుకొని మధ్యాహ్నం అన్నదానం చేశారు. స్థానిక మదరసాలో మసీదు కమిటీ సభ్యులు జెండా ఎగురవేసి వందన సమర్పణ చేశారు.

నందలూరు(రాజంపేట) : నందలూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. కోర్టులో జడ్జి లత, నాగిరెడ్డిపల్లె అర్బన్ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ సూర్యనారాయణ, పీహెచ్‌సీలో వైద్యాధికారిణి సృజన జాతీయ జెండాను ఎగురవేశారు.

రాజంపేట : 77వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను రాజంపేట సబ్‌కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఆర్డీఓ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. పలువురు అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. అటవీశాఖ కార్యాలయంలో జిల్లా అటవీ శాఖాధికారి వివేక్, రైల్వేస్టేషన్‌లో స్టేషన్ మేనేజరు వెంకటసుబ్బయ్య, కోర్టు ప్రాంగణంలో సీనియర్ సివిల్ జడ్జి కేశవ, సబ్‌డివిజనల్ కార్యాలయంలో డీఎస్పీ చైతన్య, వైద్యవిధాన పరిషత్ పెద్ద సుపత్రిలో సూపరిండెంట్ డా.పీవీఎన్‌రాజు. ఆర్‌అండ్‌బీ, ఫైర్, సబ్‌జైలు, ట్రెజరీ, పంచాయతీరాజ్, అర్బన్, రూరల్ పోలీసుస్టేషన్‌ల తదితర కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. అలానే రాజంపేట పురపాలక సంఘం కార్యాలయంలో మంగళవారం జెండాను పురపాలక సంఘం చైర్మన్ పోలా శ్రీనువాసులరెడ్డి ఎగురవేశారు.

రాయచోటి : దేశభక్తి స్ఫూర్తితో, క్రమశిక్షణ అంకిత భావంతో పారదర్శకమైన సేవలందించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పిలుపునిచ్చారు. 77వ భారత స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా మంగళవారం ఉదయం కలెక్టరేట్ ఎదుట జేసీ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ, సమాచారశాఖ డీపీఆర్‌ఓ భరత్ కుమార్ రెడ్డి, డీపీఆర్‌ఓ పురుషోత్తం, సీపీఓ కృష్ణానాయక్, సర్వేశాఖ ఏడీ జయరాజ్, టూరిజం అధికారి నాగభూషణం, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల సూపరిటెండెంట్లు, కలెక్టరేట్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కలెక్టర్ బంగ్లాలో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పతాకావిష్కరణ చేశారు. జాతీయ జెండాకు వందనం గావించిన తదనంతరం పోలీసులు నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

గాలివీడు : మండలంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శేఖర్‌నాయర్ ఆధ్వర్యంలో ఎంపీపీ పద్మావతమ్మ, మైనార్టీ నాయకులు ఖాదర్‌మొహిద్దీన్(ఎస్‌కే), జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషన్‌రెడ్డి జెండాను ఎగరవేశారు.

రైల్వేకోడూరు : మండలంలో స్వాతంత్య్ర దినోత్సవ సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కోడూరు పట్టణంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో 5 వేల మంది విద్యార్థులు, ప్రజలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహం ముందువైపు 50 అడుగుల ఎత్తులో భారీ జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అమరవీరులకు నివాళుర్పించారు. పక్కనే ఉన్న గాంధీజీ , అల్లూరి సీతారామరాజుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. సమావేశంలో కొరముట్ల మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం అసువులు బాసిన భారత స్వాతంత్య్ర సమరయోధులను, వారి కృషిని వివరించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు ప్రదర్శనలకు గాను ఎమ్మెల్యే కొరముట్ల చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు. అలాగే శాంతికి చిహ్నమైన పావురాన్ని గాలిలో ఎగురవేశారు. మండలంలోని అనంతరాజుపేట వైఎస్సార్ ఉద్యాన కళాశాల ప్రాంగణంలో అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్. రూత్ జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు.

పెనగలూరు : స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు మంగళవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీధర్ రావు, పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ చెన్నకేశవ, ఎంపీడీఓ కార్యాలయంలో మండలాధ్యక్షురాలు సౌందర్య, ఆసుపత్రిలో వైద్యులతోపాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో జెండాను ఎగురవేశారు.

సంబేపల్లె : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు మండల కేంద్రంలోని ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, గ్రామ సచివాలయం, రైతు భరోసా, విలేజ్ క్లినిక్ తదితర కార్యాలయాలలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ఎంపీపీ నాగ శ్రీలక్ష్మి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, జెడ్పీటీసీ కవిత, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబర్‌రెడ్డి, అధికారులు తదితరులతో కలిసి సంబేపల్లి మండల కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

రామాపురం : ఎందరో మహనీయుల త్యాగ ఫలితమే నేడు 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నామని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగరవేసి జెండా వందనం చేశారు. అలానే తహసీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ అరవింద్ కిషోర్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ కొండారెడ్డి, ఉపాధి కార్యాలయంలో ఏపీఓ సురేంద్రనాథ్‌రెడ్డిలు జాతీయ జెండాను ఎగురవేశారు.

ఒంటిమిట్ట : స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని మండల పరిషత్, సచివాయం, పీహెచ్‌సీ, రెవెన్యూ కార్యాలయాలో ప్రజాప్రతినిధులు, అధికారులు జెండా ఎగురవేసి గౌరవ వందనం చేశారు. మండలంలోని అన్ని సచివాలయాల సర్పంచులు జాతీయ జెండాను ఎగురవేశారు. దీంతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల వద్ద జెండా రెపరెపలాడింది. స్థానిక కోదండ రామాలయం వద్ద ఉన్న ఆటో స్టాండ్ వద్ద సీపీఎం కార్యదర్శి కోనేటి వెంకట నరసయ్య ఆధ్వర్యంలో జెండాను ఎగుర వేసి, మిఠాయిలను పంపిణీ చేశారు.


సంబేపల్లెలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


గాలివీడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో..


ఓబులవారిపల్లె: ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో..


సిద్దవటం: బెటాలియన్‌లో కమాండెంటు ఆధ్వర్యంలో..


రాయచోటి టౌన్: కోర్టు ఆవరణలో..


రాయచోటి అర్బన్: జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో..


నందలూరులో జెండాను ఎగురవేస్తున్న ఎంపీపీ


రాజంపేట: జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే మేడా, ఆర్డీఓ రామకృష్ణారెడ్డి


లక్కిరెడ్డిపల్లె: జెండాకు వందనం చేస్తున్న ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, అధికారులు

బాలికల విద్యకు కెనరా బ్యాంక్ ఆర్థిక సాయం

పుల్లంపేట : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పుల్లంపేట కెనరా బ్యాంక్ విద్యా జ్యోతి స్కాలర్‌షిప్‌ను ప్రవేశపెట్టిందని కెనరా బ్యాంక్ మేనేజర్ బి.నవీన్ రాజు అన్నారు. మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ బీపీ శేషయ్య సంస్కృత పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ఎ.శ్రావణి రూ. 2500లు, 6వ తరగతి చదువుతున్న పి.మేఘన రూ. 2500లు, 7వ తరగతి చదువుతున్న ఎస్.కావ్య రూ. 2500లు, 8వ తరగతి చదువుతున్న ఎ.అనిత రూ. 5 వేలు, 9వ తరగతి చదువుతున్న కె.మంజు రూ. 5 వేలు, పదోతరగతి చదువుతున్న జి స్వాతికి రూ. 5 వేలు స్కాలర్ షిప్ కింద నగదును మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సైన్స్ టీచర్ వరదారెడ్డి, కెనరాబ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ దిలీప్ రెడ్డి, శ్రవంతి, ఓబులేసు, గౌసియా, కృష్ణచౌదరిలు పాల్గొన్నారు.


స్కాలర్ షిప్ అందుకున్న విద్యార్థులతో కెనరా బ్యాంక్ మేనేజర్ నవీన్‌రాజు

బిల్లుల చెల్లింపుల్లో నిర్లక్ష్యం తగదు

రాయచోటి అర్బన్ : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సివిల్ సప్లయ్స్ హమాలీలకు ప్రతినెలా 10వతేదీ లోపు బిల్లులు చెల్లించాలని సివిల్ సప్లయ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎన్‌జీఓ హోంలో యూనియన్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ఈపీఎఫ్ లేని హమాలీలకు వెంటనే ఈపీఎఫ్ అందేలా చూడాలన్నారు. హమాలీలకు ప్రతినెలా 10వతేదీలోపు బిల్లులు చెల్లించాలంటూ ఆందోళనలు చేపడుతున్నా అధికారులు బిల్లుల చెల్లింపుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ ఆరోపించారు. సివిల్ సప్లయ్ హమాలీలకు 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. హమాలీలకు బట్టల కుట్టుకూలీ, దసరా బోనస్ ఇవ్వాలన్నారు. దశాబ్దాల పోరాటం అనంతరం కార్మికులు సాధించుకున్న హక్కులు, సౌకర్యాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తుండడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, కార్యదర్శి గంగాధర్, నేతలు పుల్లయ్య, వెంకటేశ్, హమాలీలు ఆయూబ్, వీరాంజనేయులు, బాషా, శ్రీహరి, సూరి, ప్రభాకర్, వెంకటపతి, రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

విగ్రహ ప్రతిష్టకు రూ. 1 లక్ష విరాళం

చిట్వేలి : వెంకట్రాజుపల్లి హరిజనవాడలో గంగమ్మ విగ్రహ ప్రతిష్టకు ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా తనయుడు ముక్కా సాయివికాస్ రెడ్డి మంగళవారం రూ. 1 లక్ష చెక్కును ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో వేణుగోపాల్ రెడ్డి, సుబ్బారెడ్డి, సుధాకర్ రెడ్డి, నాగేంద్ర రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, గుండాలరెడ్డి, ఈశ్వరయ్య, సుబ్బయ్య, జనార్దన్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

ఓబులవారిపల్లె : ముక్కావారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలలో గెలుపొందిన వారికి మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి ముక్కా సాయివికాస్ రెడ్డి విద్యార్థులకు బహుమతులు అందించారు. పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ. 15 వేలు, ద్వితీయ బహుమతి రూ. 10 వేలు, తృతీయ బహుమతి రూ. 5 వేలను అందజేశారు. కార్యక్రమంలో ముక్కా మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ శ్రీధర్, ప్రధానోపాధ్యాయురాలు బుజ్జమ్మ, రఘునాథరెడ్డి, వి.చెంగల్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గ్రామస్తులకు చెక్కును అందిస్తున్న ముక్కా ఫౌండేషన్ సభ్యుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి

అధికారులకు సేవా పురస్కారాలు

ఉత్తమ సేవలకుగాను పలువురు అధికారులు సేవా పురస్కారాలు అందుకున్నారు. వీరిలో ఓబులవారిపల్లె మండల సర్వే డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్, సంబేపల్లె ఎంపీడీఓ నరసింహులు, రైల్వేకోడూరు అటవీశాఖ రేంజర్ రఘునాథరెడ్డిలు మంగళవారం రాయచోటి జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ సంబరాల్లో భాగంగా జిల్లా ఇంచార్జ్ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ చేతులమీదుగా ఉత్తమ ప్రశంసా పత్రాలు అందుకున్నారు. అలానే రాజంపేట సబ్ కలెక్టరేట్‌లో జరిగిన వేడుకల్లో రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జునరెడ్డి, ఆర్డీఓ రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా నందలూరు మండల వైద్యాధికారిణి డాక్టర్ సృజన, పుల్లంపేట తహసీల్దార్ నరసింహకుమార్‌లు ఉత్తమ సేవ పురస్కారాలను అందుకున్నారు. – సాక్షి, నెట్‌వర్క్


కోడూరు రేంజర్ రఘునాథరెడ్డి


డీటీ రామ్మోహన్


తహసీల్దార్ నరసింహకుమార్


ఎమ్మెల్యే మేడా చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న డాక్టర్ సృజన


ఇన్‌చార్జ్ మంత్రి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ గిరీషా చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎంపీడీఓ నరసింహులు